రేపు జాండ్రపేట దర్గా గంధ మహోత్సవం


గంధ మహోత్సవం కరపత్రం అవిష్కరిస్తున్న భక్త బృందం సభ్యులు

వేటపాలెం: ఎంతో చరిత్ర కల్గిన జాండ్రపేట దాదా అమీన్‌పీర్ దర్గా 48వ గంధ మహోత్సవం ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నదని దర్గా భక్త బృందం సభ్యులు తెలిపారు. శనివారం దర్గా వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గంధ మహోత్సవ వివరాలు వెల్లడించారు. చీరాల–వేటపాలెం ప్రధాన రహదారి పక్కన చరిత్ర కల్గిన దర్గా వద్ద ప్రతి ఏడాది మహోత్సవం జరుగుతుందని తెలిపారు. కులమతాలకు అతీతంగా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్గాను సందర్శించుకొని మొక్కులు తీర్చుకొంటారని తెలిపారు. 8వ తేదీన ఉదయం 7 గంటలకు మహాత్ముడి పేరిట ప్రవచనాలు జరుగుతాయని, 10 గంటలకు ఫకీర్ల జల్లాలతో బ్యాండు సంచాలతో గంధం మెరవణి ఊరేగింపుగా బయలు దేరుతుంది. సాయంకాలం 6 గంటలకు గంధం దర్గా షరీఫ్‌కు చేరుతుందన్నారు. 9వ తేదీన, అఖండ దీపారాధన, రాత్రికి మహాత్ముల పేరిట బయాన్ జరుగుతుంది. 10వ తేదీన ఉదయం 6 గంలకు తెహలీల్ ఫాతేహా అనంతరం ప్రసాదాలు పంపిణీతో ముగుస్తుంది. కార్యక్రమానికి కడప పెద్ద దర్గా పీఠాధిపతులు హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరిఫుల్లా మొహమ్మద్ హుస్సేన్, చిష్టిపుల్ ఖాదరి సజ్జాద నషీన్ స్వాములు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో దర్గా భక్త బృందం సభ్యులు కరీముల్లా, ఆలీఖాన్, వలీఖాన్, శివయ్య, మహబూబ్ షరీఫ్, చక్రవర్తి, బుడే, ఖాలేషా, కొండలు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలోకి చేరిన ఎస్సీ కాలనీవాసులు

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

యద్దనపూడి: మండలంలోని పోలూరు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన 9 టీడీపీ కుటుంబాల నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారిని నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కులమత పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలకు స్వర్ణయుగమైన జగనన్న పాలనకు అందరం మద్దతుగా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఐమాల శ్యాంసన్, నాయకులు చిలుకూరి కృష్ణయ్య, జిల్లలమూడి హరిబాబు, గద్దల పందుయ్య, జీవరత్నం, కాజీయ్య, పోలూరు ఆరోగ్యం, నాగయ్య, రామోహన్, కందుల బేసలేరు, గొర్రెపాటి గురకయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైఎస్సార్ సంత ప్రారంభం

అద్దంకి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక మార్కెట్ యార్డులో ప్రతి ఆదివారం కూరగాయల మార్కెట్ నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్, జజ్జన ఈశ్వరమ్మ ఆనందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపన ప్రకారం నేటి సంతలో టమోటా, దొండ, దుంప, బీట్‌రూట్, కీర, క్యాబేజీ, ఉల్లిపాయలు కిలో రూ.30, పచ్చి మిర్చి, వంకాయ, బెండ, దోసకాయ, పొట్లకాయ, క్యారెట్, కాకరకాయ రూ.50, బీన్స్ రూ.100, క్యాప్సికమ్ రూ.80, అరటికాయ రూ.10, సొరకాయ రూ.15, మునగ రూ.120, గోరు చిక్కుడు, బీరకాయ రూ.60, పెద్ద చిక్కుడు రూ.90, కాకర రూ.70, విక్రయించనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు తక్కువ ధరకే కూరగాయలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసరప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

మృతురాలి కుంటుంబ సభ్యులకు సాయం


మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న హనిమిరెడ్డి

జే.పంగులూరు: మండల పరిధిలోని జాగర్లమూడివారి పాలెంలో తెలగతోటి సరోజనమ్మ (50) అనారోగ్యంతో మరణించింది. శనివారం సరోజనమ్మ కుటుంబ సభ్యులను అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పానెం హనిమిరెడ్డి పరామర్శించారు. వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు శనివరం మృతిచెందాడు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుంకుపాడు గ్రామానికి చెందిన స్వర్ణ కిషోర్‌బాబు (31) కల్లాం స్పిన్నింగ్ మిల్లు వద్ద బార్బర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో మనస్పర్థలు రావటంతో విడాకులు తీసుకుని వేరుగా ఉంటున్నాడు. విడాకులు తీసుకోవటంతో మనస్తాపానికి గురైన కిషోర్ 18 డిసెంబర్ 2023న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. గమనించిన బంధువులు మొదట అద్దంకిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ మరలా మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

రహదారికి మరమ్మతులు


బ్రిడ్జిపై ఉన్న గుంతల్లో వేసిన తారు

అద్దంకి: మంచి చేయడానికి ఏదో పదవి అవసరం లేదు. ఓ పార్టీ నియోజకవర్గ ప్రతినిధిగా ఉన్న పానెం హనిమిరెడ్డి రహదారులను బాగు చేయించే పనిని చేపట్టాడు. దీనిలో భాగంగా అద్దంకి–దర్శి రహదారిలో గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్నారు. వెంటనే రహదారిలోని గోతులకు తారు వేయించారు. దీంతో వాహనదారులు హనిమిరెడ్డికి అభినందనలు తెలియజేశారు.

ప్రాచీనమైన గ్రామం ధర్మవరం


మాట్లాడుతున్న రచయిత జ్యోతి చంద్రమౌళి

అద్దంకి: మండలంలోని ధర్మవరం గ్రామం చాలా ప్రాచీనమైనదని రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన అన్నారు. ధర్మవరం గ్రామ పాఠశాలలో శనివారం నిర్వహించిన విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన ధర్మవరం చారిత్రక వైభవం పుస్తక పరిచయ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ ధర్మవరం గ్రామంలో జైన మత తీర్థంకరులు ఇక్కడి నుంచే మత ప్రచారం చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. పుస్తక రచయిత జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ ఆదిమానవుల కాలం నుంచి నేటి వరకు జరిగిన ధర్మవరం చరిత్రను వివరించారు. అద్దంకి శాసనం, కందుకూరు శాసనం వేయించిన పండరంగని గురించి చరిత్రను కళ్లముందు కట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాకాధికారి బీ సుధాకరరావు, ధర్మవరపు చారిటీస్ అధ్యక్షుడు ధర్మవరపు హరిబాబు, ధర్మవరపు శ్రీనివాసరావు, ధర్మవరపు శ్రావన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని వివరాలతో అధికారులు హాజరు కావాలి


మాట్లాడుతున్న డీఈఓ రామారావు

చినగంజాం (పర్చూరు): పాఠశాలల ఆధునికీకరణకు సంబంధించి పర్చూరులో ఆదివారం మండల విద్యాశాఖ అధికారుల సమావేశం జరుగుతుందని డీఈవో రామారావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటల నిర్వహించే సమావేశంలో పర్చూరు, ఇంకొల్లు, చినగంజాం, యద్దనపూడి, మార్టూరు, కారంచేడు మండలాల విద్యాశాఖ అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 10 వ తరగతి పరీక్షలు, పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల వివరాలు, అమ్మఒడి రాని విద్యార్థుల వివరాలు, ఎస్ఎమ్ఎఫ్ అమౌంట్ వివరాలు, తదితర వివరాలకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, ఎంఈఓ సత్యనారాయణ, వెంకటరామయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్


పింఛన్లు అందిస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

యద్దనపూడి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచుతూ ఇచ్చిన హామీని నెరవేర్చి విశ్వసనీయతకు మారుపేరుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని జెడ్పీటీసీ చుండి లక్ష్మినారాయణమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గత ప్రభుత్వ హయంలో కేవలం పింఛన్ రూ.1000 మాత్రమే ఇచ్చేవారని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.2250 చేశామన్నారు. అలాగే ఏడాదికి రూ.250 చొప్పున పెంచుకుంటూ ఇప్పుడు రూ.3000 వరకు ఇస్తున్నామన్నారు. టీడీపీ హయంలో 39 లక్షల మంది ఉన్న లబ్ధిదారులు ఇప్పుడు 66 లక్షల మందికి పింఛన్ ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్‌కు రూ.400 కోట్లు మాత్రమే మంజూరు చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెలకు రూ.1950 కోట్లు ఖర్చు చేసి వృద్ధులకు, వింతతువులకు, వికలాంగులకు, భరోసా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణకుమారి, యద్దనపూడి సర్పంచ్ వల్లేరు రేణుక, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు మేట్ల ఎంపిక

బల్లికురవ: ఉపాధిహామీ పథకంలో పనుల కోసం మేట్లను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఏపీవో బాలకృష్ణ నాయక్ శనివారం తెలిపారు. రైత్వారీ కుంటలు పండ్లతోటల సాగు, పవువుల కొస్టాల నిర్మాణం, పంట, చెరువు కాలువల అభివృద్ధికి 21 గ్రామ పంచాయతీల్లో 2024–25 సంవత్సరానికి రూ.18 కోట్లతో అంచనాలు తయారు చేశామని చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు 10 మంది మేట్లను ఎంపిక చేస్తామని పదో తరగతి పాసై ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నవారు అర్హులన్నారు. సోమవారం నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో పని కల్పించటంతో పాటు, రోజువారీ కూలి రూ.272 చెల్లిస్తామని చెప్పారు.

అంగన్‌వాడీలు తక్షణమే విధుల్లో చేరాలి

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, సహాయకులు సోమవారం సాయంత్రం లోపు విధుల్లో చేరాలని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీవో సుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 134 కేంద్రాల్లో 134 మంది కార్యకర్తలు, 130 మంది సహాయకులు విధులకు గైర్హజరుతో 26 రోజులుగా సమ్మెలో ఉన్నారన్నారు. సచివాలయాల ద్వారా పౌష్టికాహార పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామని ప్రీస్కూల్ నిర్వహణ జరగటంలేదని చెప్పారు. ప్రిన్సిపల్ సెక్రటరీ జీ. జయలక్ష్మీ, ఉత్తర్వుల మేరకు తక్షణమే విధుల్లో చేరాలని లేకుంటే కార్యకర్తలు, సహాయకులకు నోటీసులు అందజేస్తామని సీడీపీవో హెచ్చరించారు.

పాఠశాల అభివృద్ధికి దాతల కృషి ఎనలేనిది


పాఠశాల వ్యవస్థాపకుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

యద్దనపూడి: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం, కృషి అభినందనీయమని హెచ్ఎం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పూనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పాఠశాల నిర్మాణ వ్యవస్థాపకులు మేడూరి కృష్ణయ్య, గన్నమనేని కోటిస్వామి విగ్రహాలను పాఠశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగాహెచ్ఎం చుట్టుపక్కల గ్రామాల్లో పాఠశాలలు లేని రోజుల్లో 1950లో 5 ఎకరాల విస్తీర్ణంలో ఓ పాఠశాలను నిర్మించి ఎన్నో వేలమందికి అక్షరభిక్ష పెట్టి ఉన్నత శిఖరాలకు వెళ్లేందుకు దోహదపడిందన్నారు. అలాంటి పాఠశాల నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో సరస్వతి పూజ, గురుపూజ, నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక వారసులు మేడూరి మురళీకృష్ణ, బత్తుల కృష్ణవేణి, ఎంఈఓ–2 గోపి, వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు దీవి బావానాచార్యులు, మాజీ సర్పంచ్ బోయపాటి సాంబశివరావు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చీరాల అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యమని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎస్.లక్ష్మణరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక ఎస్‌జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో గ్రూప్–2 అభ్యర్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి గ్రూప్–1 అధికారి రాయుడు రవికుమార్ హాజరయ్యారు. ప్రధాన వక్తగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రతిరోజు కొంత సమయం పత్రికలు చదవడానికి కేటాయించాలన్నారు. తద్వారా జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవడానికి కృషి చేయాలన్నారు. ముందుగా సమాధానం తెలిసిన ప్రశ్నలను పూర్తి చేయాలన్నారు. లక్షలాది మంది అభ్యర్థులు పోటీపడుతున్నారన్నారు. ఈ పోటీలో విజయం సాధించాలనే ప్రణాళికబద్ధమైన కృషి అవసరమన్నారు. అనంతరం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, యూటీఎఫ్ నాయకులు బి.భిక్షాలుబాబు, పి.సురేష్, కుర్రా శ్రీనివాసరావు, పి.సీతారామరాజు, కె.వీరాంజనేయులు, కెవిపిఎస్ నాయకులు ఎల్.జయరాజు, ఎస్‌జె లూథరన్ కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ


క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులోని నాలుగు సచివాలయాల పరిధిలో గల క్రీడాకారులకు శనివారం అధికారులు, నాయకులు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, టీ షర్టులు, క్యాప్‌లు తదితర క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ మీరావళి, రాజా నాయక్, గడ్డం మస్తాన్ వలి, కె. పృథ్వీరాజ్, గొట్టిపాటి ఆనంద్, రాజు, సచివాలయ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

37 మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

బల్లికురవ: మండలంలోని వేమవరం గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు సమాచారంతో శనివారం బల్లికురవ ఎస్సై వీ.వేమన సిబ్బందితో దాడులు చేపట్టారు. గ్రామానికి చెందిన కొమరగిరి శ్రీను ఇంట్లోనే మద్యం దుకాణం ఏర్పాటుతో అమ్మకాలు చేపడుతుండగా 37 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తప్పిపోయిన బాలుడు సురక్షితం


బాలుడిని అప్పగిస్తున్న ఎస్సై

చీరాల: తప్పిపోయిన బాలుడిని పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై జనార్దన్ వివరాల మేరకు శనివారం ఈపూరుపాలెం సెంటర్‌లో ఓ బాలుడు అనుమానాస్పదంగా సంచరించడంతో గ్రహించిన స్థానికులు బాలుడిని ఎస్సైకు అప్పగించారు. బాలుడు తన పేరు సాయి అని చెప్పడం తప్ప పూర్తి వివరాలు చెప్పకపోవడంతో బాలుడి ఆచూకీ తెలిసినవారు సంప్రదించాలన్నారు. ఈ మేరకు ఎస్సై విచారణ చేపట్టగా బాలుడు ఈపూరుపాలెం పంచాయతీ ఎలక్ట్రీషియన్ చంద్ర కుమారుడిగా గుర్తించారు. తమ కుమారుడు పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడని సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు స్టేషన్‌కు వెళ్లగా బాలుడిని అప్పగించారు. ఈసందర్భంగా వారు ఎస్సైకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కారు టైరు పేలి వ్యక్తికి తీవ్రగాయాలు

అద్దంకి: కారు టైరు పేలి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన పట్టణంలోని ద్వారకా నగర్ వద్ద శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు పట్టణంలోని ద్వారకా నగర్ వద్ద ఆర్ యల్ల మందరావు ట్రాక్టరు టైరు విప్పదీసున్నాడు. ఈ క్రమంలో టైరు ఒక్కసారిగా పేలి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పరిస్థితి విషమంగా ఉండడంతో 108 సిబ్బంది క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.